# అల చెరపని అక్షరం

పరిచయాలు .స్నేహాలుగా మారి ప్రేమగా రూపం సంతరించుకోడానికి పెద్దపెద్ద కారణాలుండక్కరలేదు.

ఆ రాత్రి మేఘమాలకి సముద్రం ఎంతో అందంగా తోచింది.

ఆ రాత్రి సాగర్‌స్మైల్స్‌కి ఆకాశం ఎంతో విశాలంగా కనిపించింది.

"వెన్నెల్లో సముద్రుడా!

సముద్రపు నావపై ఓ నావికుడా" పాటలు వింటూ చప్పట్ల వాయిద్యం సమకూరుస్తూ ఆ కొండని చేరాలి.

ఊరికి దూరంగా- ప్రజలకి దూరంగా-

ఏకాంతంగా- జంటలు జంటలుగా ఆ కొండపై కూర్చుని సముద్రాన్ని చూస్తూ ప్రణయానికి భాష్యాలు చెప్పిన ప్రేమికుల్ని చూసిన కొండది.

విరిగిన పెద్దపెద్ద బండరాళ్ళపై పచ్చని నాచు పచ్చికలా మెరుస్తుంది. పెద్దపెద్ద అలలు వేగంగా వచ్చి ఒక్కో కొండచరియని "ఢీ" కొట్టుకున్నప్పుడు పూలజల్లులా రాలే నీటిబిందువులు.

ముత్యాలజల్లుల్లా కురిసే నీటితుంపరలు.

"ఆ వచ్చే కెరటం ఈ బండరాయిని ఢీకొడుతుంది" దూరంగా కనిపిస్తున్న అలని చూస్తూ అంది మేఘమాల.

"ఏంకాదు. ఆ బండరాయిని ఢీకొనదు. ఆ మధ్యలో శంఖం ఆకారంలో కనిపిస్తుంది చూడు దాన్నే ఢీకొంటుంది" అన్నాడు సాగర్‌స్మైల్స్.

"ఏంకాదు. పందెం" ఉక్రోషంగా అంది మేఘమాల.

"పందెం" నవ్వుతూ అన్నాడు సాగర్‌స్మైల్స్.

"ఏంపందెం" అడిగింది మేఘమాల.

"నువ్వే చెప్పు" అన్నాడు.

"నువ్వు ఓడిపోతే తెగిపోయిన నా చెప్పులు కుట్టించుకురావాలి. అదీ మహారాణిపేటలో లేడీస్ హాస్టల్ ఎదురుగా ఉన్నతను దగ్గర. పేపర్‌లో చుట్టకుండా పట్టుకెళ్ళాలి"

"వద్దద్దూ. కొత్త చెప్పులు కొనిస్తాను" కంగారుగా అన్నాడు స్మైల్స్.

"నాకు కొత్తవి వద్దు. తెగిన చెప్పులే కుట్టించాలి" ఖచ్చితంగా చెప్పింది మేఘమాల.

"అరరే కెరటం ఏది" సముద్రం వైపు చూస్తూ అడిగాడు సాగర్‌స్మైల్స్.

"మనం పందెం గొడవలో ఉండగా కొట్టుకుపోయినట్టుంది" అంది మేఘమాల.

"సముద్రానికి మనమంటే సమానమైన ఇష్టం ఉంది. ఒకర్ని గెలిపించి మరొకరికి అన్యాయం చేయటం ఇష్టంలేక మనం చూడనప్పుడు తన కెరటాన్ని పంపించింది" అన్నాడు సాగర్‌స్మైల్స్.

* * * *

ఓ బండరాయిపై సాగర్‌స్మైల్స్ పేరుని మరో బండరాయిపై సాగర్‌స్మైల్స్ తన పేరుని వ్రాసింది.

"ఏం నా పేరు అంతెత్తు రాయిపై వ్రాసావు" అడిగాడు సాగర్‌స్మైల్స్.

"నా పేరుకంటె ముందు నీ పేరు కొట్టుకుపోకుండా"

"నువ్వు చాలా స్వార్థపరురాలివి"

"ఏం?" తెల్లబోతూ అడిగింది.



"నీపేరు లేకుండా నాపేరెందుకక్కడ? పోతే ఒకేసారి ఇద్దరివీ పోవాలి" అన్నాడు సాగర్‌స్మైల్స్.

"ఈ పేర్లు కనీసం మన పెళ్ళయ్యేవరకైనా ఉండాలి."

ఏ కెరటం ఏ బండరాయిని ముందు స్పృశిస్తుందోనని, ఏ కెరటం ఎవరి పేరుని ముందు గనలో కలుపుకుంటుందోనని కట్టే పందాలు విని గుంభనంగా నవ్వుకునేది సముద్రం.

ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎ...

"బావ్‌రే ఇక చాలు" బండలపై అంకెలు వేస్తున్న సాగర్‌స్మైల్స్‌కి చెప్పింది మేఘమాల

"ఏం?"

"ఒక్కరోజు నిన్ను చూడకపోతే నాకెంతో బెంగగా ఉంటుందేంటో' అన్ని సంవత్సరాలు పెళ్ళిని పోస్ట్‌పోన్ చేస్తే ఎలా" బేలగా చెప్పింది మేఘమాల.

"ఏయ్ పిచ్చి! ఇది ఉత్తిత్తి ఆట"

"అయినా సరే" అంకెల్ని చెరపాలని విసురుగా కూర్చున్న చోటునుండి లేచింది మేఘమాల.

"ఏయ్ జాగ్రత. కాలుజారినా, పట్టుతప్పినా సముద్రంలోకే" కంగారుగా చెప్పాడు సాగర్‌స్మైల్స్.

వాళ్ళు వ్రాసిన అంకెల్లో కెరటాలు వచ్చినప్పుడు కొట్టుకుపోకుండా చివరికి ఏ అంకె మిగులుతుందో అన్ని సంవత్సరాలని వాళ్ళపెళ్లి జరుగుతుంది. అదేవాళ్ళఆట.

మోకాళ్ళపై ఇద్దరూ ప్రక్కప్రక్కన కూర్చుని వస్తున్న కెరటాలని దీక్షగా చూస్తున్నారు.

చాలా ఎత్తుగా చాలచాల ఉధృతంగా వస్తున్న ఒ. కెరటం ధన్‌మని కొండనితాకి ఇద్దర్ని తడిపి అంతే వేగంగా విరిగిపోయింది.

ఏ అంతె మిగిలిందానని ఆత్రాతగా ముందుకి వంగాడు సాగర్‌స్మైల్స్. వంగడంలో పట్టు తప్పింది కాలు.

అంతే!

ఏ ఈత, ఏ శక్తి రక్షించలేని భయంకర మైన అలలతో నిండిన ఆ లోతైన సముద్రంలోకి రెప్పమూసే కాలంకంటే ముందుగా కలిసిపోయాడు సాగర్‌స్మైల్స్.

ఏ కెరటం ఆగలేదు. సముద్రం మూగపోలేదు.

కెవ్వుమన్న కేక మేఘమాల పెదవి దాటలేదు.

" ఏ కెరటం తన సాగర్ని తనకి ఇస్తుందోనని వచ్చే ప్రతి కెరటాన్ని ఆశగాచూస్తు బెదిరిపోని చిత్తరువులా అక్కడే - అలాగే-ఆ కొండపైనే కురియని మేఘంలా-మేఘమాల. *

కె. పద్మ

తెలంగాణా పేపర్ మిల్స్
పంజాగుట్ట, హైదరాబాదు-34



# స్త్రీ కాలమ్




## వద్దంటే ఆడపిల్ల

ఈ దశాబ్దంలో కూడా ఇంకా సాంప్రదాయ పెళ్ళిళ్ళు, పేరంటాలు, విందుభోజనాలు ఇవన్నీ చూస్తుంటే మనిషి ఎంత వెనకబడి వున్నాడో అర్థం అవుతోంది. పూర్వపు రోజుల్లో ఈ వ్యవస్థవల్ల ఏం లాభం పొందేవారో తెలియదుగాని ఈనాడు వీటన్నిటిని తట్టుకోడం పెద్ద సమస్యగా తయారయింది. అయినప్పటికీ ఆచారాలు, కట్టుబాట్లు, సంఘంలో గుర్తింపు అనే అర్థంలేని వాటికోసం మనిషి ప్రాకులాడుతూనే ఉన్నాడు, అందునా ఆడపెళ్ళివారయితే వారి బాధలు వర్ణనాతీతం. పెళ్ళి ఎంత పకడ్బందీగా చేసినా వేలకువేలు ఖర్చు, అంతేకాకుండా అమ్మలక్కల విసుర్లు, ఆడపడుచుల అలకలు, మర్యాదలు చాలేదని మగపెళ్ళివారి అహంభావాలు ఇటువంటి అనేక విషపు కోరల్లో చిక్కుకుంటున్న ఆ తలిదండ్రులు ఆడపిల్లల్ని కనడం ఏదో పాపం చేసినట్లు భావిస్తున్నారు. పుట్టబోయే బిడ్డ ఆడో, మగో ముందుగా తెలుసుకొనగలిగేటంతటి అభివృద్ధి చెందిన మానవుడు ఈ బాధల్ని భరించలేక ఆడపిల్లల్ని వద్దనుకుంటున్నాడు. ఇది నిజంగా జరిగితే కొన్నాళ్ళకి స్త్రీ జాతి సమూలంగా నాశనం కావడానికి అవకాశం లేకపోలేదు. అందువల్ల మనం ఇబ్బంది పడి, పదిమందిని ఇబ్బంది పెట్టే ఈ సాంప్రదాయ వివాహాలను విడనాడి కేవలం అతి తక్కువ ఖర్చుతో రిజిష్టర్ వివాహాలు జరిపిస్తే ఈ బాధల్ని అధిగమించవచ్చు. వరకట్నం ఆక్టోపస్ అయితే, ఈ ఖర్చులు షార్క్ చేపలు.

—పి. మాధవి

కేర్/ఆఫ్ జి. రంగారావు
ప్రేమనగరం, బరంపురం-760002.

## బామ్మగారి అనుభవం

పురాతన ఆచారాలవల్ల ఒక్కోసారి చాలా ప్రయోజనం చేకూరుతుంది. హేతువాదులు, ఆధునికులు దీన్ని ఛాందసంగా కొట్టిపడేయవచ్చు కానీ అనుభవించినవారికి అమృతంగా ఉంటుంది. వెక్కిళ్ళు వస్తే "నిన్నెవరో తలచుకొంటున్నారు పాపా" అనేది. ఒక్కసారి దిగ్భ్రాంతి కలిగిస్తే ఆ వెక్కిళ్ళు తగ్గిపోతాయని సడన్‌గా 'అదేమిటే చెప్పాపెట్టకుండా మధ్యాహ్నం కాలేజి ఎగ్గొట్టి సినిమాకెళ్ళావా? రానీ నాన్నగారిని'— అనేది. అయోమయంగా చూసే నన్నుచూసి "చూశావా నీ వెక్కిళ్ళు ఎలా ఎగిరిపోయాయో?" అనేది. కాన్పయిన పదకొండోరోజు, స్నానం రోజున్న మాట కలికం వేస్తానంటు ఆదేదో నూరి కళ్ళలో వేసేది. మొదట కొంచెం కళ్ళు మంటపెట్టినా ఆరోగ్యరీత్యా అదెంతో మేలు చేకూరుస్తుందట.

జుట్టు పాయలేసి సాంబ్రాణి పొగతో ఆరబెట్టేది. "చెమ్మఉంటే జలుబు చేస్తుందంటూ." వేడినీళ్ళు తప్ప చల్లనీళ్ళు తగలనీయకుండా చూసేది. ఇవన్నీ డాక్టర్లు నమ్మకపోవచ్చు. కానీ నమ్మే వాళ్ళుకూడా ఉన్నారు మన వాళ్ళలో. మూఢనమ్మకాలు, మూఢాచారాలంటూ కట్టివేసిన మన పెద్దవాళ్ళెంత ఆప్యాయత, అభిమానంతో మనకు సేవచేసేవారో గుర్తు తెలిస్తే మనసు పులకిస్తుంది. వాళ్ళు ఇప్పుడు ఎదురుగా లేకున్నా మనసులో సదాకాలువుంటారు. సైన్సు అన్ని విషయాలకూ రీజనింగు ఇవ్వదు. ఆప్యాయతకకూడా.

— కె. రమాప్రభాకర్

(తిరుపతి)

స్త్రీ కాలమ్ శీర్షికకి మీ రచనలు పంపి ఆకర్షణీయమైన బహుమతులు పొందండి.
-ఎడిటర్